క్రేన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

# ఓ ప్రశ్నకు ఉత్తరం!



కె.వి. రమణారావు

“ఏమేవ్...! నిన్నే... వినబడుతోందా...?” వీధి గుమ్మం నుండే అరుస్తూ, హాల్లోకి వచ్చాడు అనంతరామయ్య. భర్త అరుపు ఆమెకు పిలుపు లానే వుంటుంది. అపర్ణ అంతగా అలవాటు పడిపోయింది మరి. “వస్తున్నా” అంటూ తాపీగానే వచ్చి “ఏవిటిట” అడిగి భర్తనే పరిశీలనగా చూచింది. అతని ముఖంలో అసహనం, ఆందోళన స్పష్టంగా కనిపిస్తున్నాయి. “కాఫీ తెచ్చేదా” అడిగింది. “కాఫీ కాదు... కాస్త విషమివ్వు” ఈసారి భార్యపై విరుచుకుపడి సోఫాలో చతికిలబడ్డాడు. “అయ్యో.. అదేం మాటండీ.. ఇంతకీ ఏం జరిగిందండీ..” ఆసారి ఆందోళన ఆమె వంతయ్యింది. “ఏడి.. వాడేడి.. నీముద్దుల కొడుకు ఇంట్లో తగలడ్డాడా.. లేదా?” “లేదండి.. వాడేం చేసాడు..” ఇంకా ఏదో అడగబోయింది. “ఉండదే.. ఇంట్లో ఎందుకుంటాడు.. ఊరిమీదుంటాడు. జనానికి సేవ చేయాలి కదా.. చేసి నాపీకలమీదికి తెస్తుంటాడు.” ఉద్రేకంతో చేతిలో వున్న దిన పత్రిక ఎదురుగా నున్న టీపాయ్‌కేసి కసితో కొట్టాడు.. “విషయమేమిటో చెప్పండి..” వినయంగా అడిగి అతని సరసనే కూర్చొంది.

“చెప్పేదేముంది ... ఎవడినో కారుగుద్దిందట. కారువాడు వుడాయించాడు అటుగా మోటారు బైక్ పై వెళుతున్న నీ సుపుత్రుడు చచ్చేలా వున్నవాడిని ఆసుపత్రికి చేర్చాడట. అంతేనా.. పోలీసులకు ఫోన్ చేసి ఆక్సిడెంట్ చేసిన వాని కారు నంబరు చెప్పి తానే ప్రత్యక్షసాక్షినని కంప్లైంట్ ఇచ్చాడట. ఆకారు పేరు మోసిన పొలిటీషయన్‌ది. ఆకారు నడుపుతూ ఆక్సిడెంటు చేసింది ఆ పొలిటీషియన్ కొడుకేనట. అంతటితో సరిపోయిందా... ఆయన స్వయంగా ఆసుపత్రికి వచ్చి నీ కొడుకిచ్చిన స్టేట్‌మెంట్ వాపసు తీసుకోమన్నా మనవాడు ససేమిరా అన్నాడట... కాసేపటికి చస్తాడనుకున్న వాడు బ్రతకడంతో, ఆ పొలిటీషియన్ వాడితోనే తప్పుడు వాంగ్మూలం ఇప్పించాడట...”

“ఏమని...” ఆందోళన అధికం కాగా కంగారుగా అడిగింది.. తాను పడింది కారు క్రిందనే కాదని మోటారుసైకిలు తనను గుద్దిందని ఆ తరువాత ఏం జరిగిందో తనకు తెలియదని పోలీసులకు చెప్పాడు.. ఆ మోటారు సైకిల్ మనవాడిదేనని, ఆక్సిడెంట్ చేసిందీ మనవాడేనని పోలీసులు కేసు నమోదు చేశారట. అదిగో పేపరు “చదువు” అని తలపట్టుకు కూర్చున్నాడు అనంతరామయ్య. “ఎంత ఘోరం.. ఎంత అన్యాయం... పుణ్యానికి పోతే పాపమా... భగవంతుడా! నాబిడ్డను నీవే రక్షించాలి...” కన్నీటి తో కలగుండు పడిపోతోంది అపర్ణ. “నేను మొదటి నుండి మొత్తుకుంటున్నాను. నేలను పోయేదాన్ని నెత్తికెత్తుకోవద్దని.. ఆక్సిడెంట్ ఎంతమంది చూడలేదు!... ఆ ప్రక్కగా ఎంతమంది ప్రయాణించలేదు! వాళ్ళకెవరికీ లేనిది.. వీడికేనా మానవత్వమున్నది.. వారంతా మనుషులుకారా... వారికి మనసులేదా.... కలుగ జేసుకుంటే జరిగేదేమిటో వాళ్లకు తెలుసు. తెలిసి, తెలిసి తేనె తుట్టెలో చేయి పెట్టే మూర్ఖులు కాదేవాళ్లు”. “అదేం


ధర్మమండీ... కనీసం చచ్చిబతికిన ఆ మనిషికయినా కృతజ్ఞత లేకపోయిందేమండీ... అంత అబద్ధం చెప్పడానికి అతనికి నోరెలా వచ్చిందో" పైట కొంగు నోటికి అడ్డుపెట్టుకుని బావురుమంది అపర్ణ. ''ఇప్పుడెందుకు ఏడ్వడం? ఏడ్చి ప్రయోజనమేముంది.. ఏదో సమయంలో పోలీసులు వస్తారు. వాడు కనబడకపోతే వాడొచ్చేవరకు నన్నయినా తీసుకుపోతారు".

ఏవిట్రా అనంతూ ! తీసుకుపోతారంటున్నావ్.. ఎవర్ని..ఎందుకు... ఎక్కడికి...? అడుగుతూనే అడుగుపెట్టాడు పరంధామయ్య. అతని రాకతో లేచి నుంచున్నారు ఆ దంపతులిద్దరూ. ఏవిటి అదోలావున్నారు.. "కాస్త మంచి తీర్థం అందుకో అపర్ణా" చెప్పి ప్రక్కనే వున్న ఫ్రేము కుర్చీలో కూర్చున్నారాయన. "నాన్నా! ఆదిత్య కనిపించాడా ఎక్కడయినా?" అడిగాడు తండ్రిని. "నిన్న సాయంత్రం వాడిని కాకినాడ పంపించాను కదా. మీకు చెప్పడం మరిచాను.'' అంటూ కోడలు తెచ్చిన మంచినీరందుకున్నాడు. "కాకినాడా, ఎందుకు నాన్నా...?" అడిగాడు అనంతరామయ్య. "అదేరా నా మిత్రుడు సుందరం లేడూ.. వాడికి కాస్త నలతగా ఉందని ఫోన్ చేస్తేనూ.. వాళ్ళబ్బాయి శంకర్ అమెరికాలో వుంటున్నాడు. వెళ్ళి మంచి చెడ్డలు చూచి రమ్మని పంపానులే.."అని వివరించి, ''ఇంతకీ, మీరెందుకో ఆందోళనగా కనబడుతున్నారు, చెప్పారు కాదు." జరిగినదంతా చెప్పాడు అనంతరామయ్య. ''అదా సంగతి. ఆ పెద్దమనిషి నాకు తెలిసినవాడే. పైగా నా శిష్యుడు, కేసు వాపసు తీసుకుంటాడు. ఇంతలోనే అంతగా బెంబేలు పడాలిట్రా.." మనవాడు చేసింది మంచిపని. పరోపకారం. ఒకప్రాణిని కాపాడాడు. అందుకు సంతోషించాలిగాని ఇలా తలలు బద్దలు కొట్టుకోవడం ఎందుకట.."

''అవును నాన్నా మీ కలాగే వుంటుంది. వాడినలా ప్రోత్సహించింది మీరే కదా నీతి, నియమం, దానం, ధర్మం, న్యాయం అంటూ ఉగ్గుపాలతో రంగరించి వాడికి ఊపిరులూదారు. నాన్నా.. మీ చిన్ననాటి సమాజం కాదు. ఆ రోజులు వేరు. ఆ మనుషులు వేరు. ఆనాటి ప్రజల మనస్తత్వం వేరు. ప్రస్తుత సమాజధోరణి వేరు. అంతా స్వార్ధం.. ఎవరికి వారే.. చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష అనుకునే వారే అందరూ.." విస్తుపోయి చూస్తున్న అపర్ణను గాని, వింతగా చూస్తున్న తండ్రిని గాని పట్టించుకోకుండా తన భావాన్ని బాధను కక్కేస్తున్నాడు అనంతరామయ్య... "నడి బజారులో చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నా... పక్కింటివారిల్లు తగలబడి పోతున్నా... ఎదురింట్లో దొంగలు పడి దోచుకుంటున్నా... పట్టపగలే పరాయిస్త్రీని పట్టి పదిమంది పడి మానభంగం చేస్తున్నా... ఎవరికివారే...యమునాతీరే... ఇది జనారణ్యం నాన్నా.. చూచిన నిజం చెప్పడానికి కాని, అసలు నిజాన్ని చూడడానికి గాని ఇష్టపడని భయస్తులు నాన్నా ఈ జనం... ఒంటరివానిని చేసి పదిమంది పైనబడి ముక్కలుగా తెగ నరుకుతున్నా తలుపులు మూసుకోవడం మీకు తెలియనిదా... అరవై మంది ప్రయాణిస్తున్న బస్సును నలుగురు రౌడిలు కత్తులు చూపి బెదిరించి దోచు కుంటున్నా గుడ్లప్పగించి చూస్తూ తమ వద్దనున్న సొత్తంతా మూటగట్టి అప్పగిస్తారే తప్ప ఏ ఒక్కడయినా తిరగబడతాడా నాన్నా... ఏం, ఎందుకు ఎవరి ప్రాణం వారికి తీపి... ఇవన్నీ మీకు తెలియనివి కావు కదా, అయినా మీరు ఆదిత్యను మీ కోణంలోనే పెంచారు. పెను ప్రమాదంలోకి వాడిని నెట్టారు" ఉబికుబికి వస్తున్న దు:ఖాన్ని గొంతులోనే అదిమి పెట్టి గద్గద స్వరంతో తన భావాన్ని బయట పెట్టిన అనంతరామయ్య ఆవేదనతో చలించిన పరంధామయ్య వడివడిగా అడుగు లేస్తూ వీధి వెంబడి వెళ్ళిపోయాడు.

మండుటెండలో వడివడిగా పోతున్న మామగారిని చూచిన అపర్ణ ఏవండీ... మీ నాన్నగారు ఎండన పడివెళ్లారు. మీరంతగా ఆవేశపడి ఉండాల్సింది కాదు.. నాకేదో భయంగా ఉంది. అని వాపోయింది. ఆమె ఆవేదన అనంతరామయ్య పై ఎలాంటి ప్రభావం చూపలేదు.. కాస్సేపటికి నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.. అపర్ణా, నాన్నగారికి నీవు అన్ని విధాల సహకరించడంతో పరిస్థితి విషమించింది.. ఆయనకారణంగానే ఆదిత్య ఇన్ని ఇక్కట్లు పడుతున్నాడు. నలుగురితో పాటు నారాయణ, కులంతో బాటు గోవిందా అని వారి కాలంనాడే చెప్పినా వారి చెవికెక్కదు. అంటున్నాడు. అంతలో ఆదిత్య వచ్చాడు. ఆదిత్యను చూడగానే అతనిలో ఆగ్రహం కట్టలు తెంచుకొంది.

"ఏరా! పరామర్శకు పోయినవాడివి పలకరించి చక్కా రాకుండా అక్కడేం పనిరా నీకు... నిన్న అనగా పోయి ఇప్పుడా రావడం" అని గద్దించాడు. "నాన్నగారూ! నే వెళ్లేసరికి పాపం సుందరంగారు గుండెనొప్పితో గిలగిలలాడి పోతున్నారు.. సమయానికి దగ్గరి వారెవరూలేరు. వారి భార్యకు తోడుగా వుండి వారిని అసుపత్రి లో చేర్పించి, వారబ్బాయికి



ఫోన్ చేసి వారమ్మాయి, అల్లుడు వచ్చే వరకు వుండి వచ్చాను" చెప్పాడు వినయంగా.

"ఔను మరి, ఆపద్బాంధవుడవు నీ వద్దు పడకపోతే ఆయన బ్రతకడు. ఈ రోజు దినపత్రిక చూశావా... నీ నిర్వాకం ఎంతగా వెలిగిపోతొందో...! ఎవరిదో ఇల్లు కాలి పోతోందని తగుదునమ్మా అంటూ పరుగెత్తి వళ్లు కాల్చుకున్నావు ఒకసారి. ఇరుగు పొరుగుకు లేని దురద నీకెందుకురా అంటూ వినకపోతివి. ఆ మధ్య తుఫాను సమయంలో మానవసేవ అంటూ నిద్రాహారాలు మరచి, వానలో తడిసి, ప్రాణం మీదకు తెచ్చుకున్నావు. పోయిన జనవరిలో బస్సును ఆపి కత్తులతో బెదిరించి, సొమ్ములు ఇమ్మంటే, ఆ దుండ గులను ఎదిరించి, చావుదెబ్బలు తిన్నావు. తోటి ప్రయాణికులలో ఒక్కడంటే ఒక్కడు నీకు సహాయపడ్డాడా? ఎందుకు రా నీకు ఈ కంచి గరుడసేవ...."రోషమో, ఉక్రోషమో గాని, వాక్ప్రవాహంతో వూగిపోతున్నాడు అనంతరామయ్య.

అంతలోనే పరంధామయ్యగారు తిరిగి వచ్చారు. లోపలికి వస్తూనే, "ఒరే, అనంతూ....ఆ పొలిటీషియన్ నా శిష్యుడే రా... పైగా చాలా మంచివాడు. ఎక్కడో, ఏదో పొరపాటు జరిగిందని నొచ్చుకుంటూనా ఎదురుగానే పోలీసులకు ఫోన్ చేసి మనవాడి మీద కేసు తప్పించాడు. దేవుడు కరుణా మయుడు... అని మనవడిని ఉద్దేశించి, "ఒరే, అబ్బిగా.... సుందరానికి ఎలా ఉందిరా ? అడిగాడు. జరిగింది చెప్పాడు ఆదిత్య. పోనీలే సమయానికి ఆ దేవుడే నిన్ను పంపాడు". "దేవుడు కాదులెండి, పంపింది మీరు. ఇక ముందు ఇలాంటి పనులకు నా బిడ్డను ప్రోత్సహించకండి. వాడి చదువుకు, మంచి భవిష్యత్తుకు ప్రోత్సహించండి."అనంతరామయ్య అన్న మాటలు తన గుండెకు నొచ్చుకున్నా మారు పలకకనే తన గదికి పోయి విశ్ర మించాడు పరంధామయ్య.

ఆదిత్య విజయవాడలో చదువుతూ హాస్టల్ నందుంటున్నాడు. తెల్లవారితే కాలేజి సెలవులు పూర్తవుతాయి. ఆ రాత్రి భోజనాలు అయ్యాక, ఆదిత్య తల్లిని పిలిచి, అమ్మా ! తాతగారు పరోపకారం కన్నా పరమార్థం లేదని, నాన్నగారు తనకుమాలిన ధర్మం కన్నా చెడ్డది లేదని చెబుతుంటారు. ఇందేది అచరణయోగ్యవెూ తేల్చుకోలేక సతమతమయిపోతున్నాను. చెప్పమ్మా..? అడిగాడు ఆదిత్య. ఆమె భర్తవైపు చూసింది "చొప్పదంటు ప్రశ్న" అంటూ తప్పుకున్నాడు అనంతరామయ్య. తాతగారి వైపు చూశాడు ఆదిత్య. ఆయన మౌనమే సమాధానం అన్నాడు. ఆదిత్య అడిగిన ప్రశ్నకు బదులే లభించలేదు. తెల్లవారగానే యథావిధిగా విజయవాడ వెళ్ళిపోయాడు.

వరంధామయ్య తొలిసారిగా పునరాలోచనలో పడ్డాడు. తన కొడుకు తన ఎదురుగా నిలబడి తన భావాలను తప్పు పట్టడం కూడా ఇదే తొలిసారి కావడంతో కలత చెందిన మనసు గతాన్ని తవ్వ సాగింది. నలభై సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైరయిన నాటినుండి మనుమడు ఆదిత్యను తన ఆదర్శాలకు అనుగుణంగా పెంచుతూ ఇరవైయేళ్ళుగా వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ వచ్చాడు. ఒక్కగానొక్క కొడుకంటూ తల్లి గారాబం చేసి తనకు ఎడంగానే పెరిగిన అనంతు తన భావాలకు విరుద్ధంగా, మారుతున్న సమాజానికి అనుగుణంగానే పెరిగాడు. ఆ కారణంగానే తన మనుమడిని తన వారసునిగానే పెంచుకున్నాడు. అందుకు అపర్ణ అన్నివిధాలా సహకరించింది. తను ఆదిత్యను తప్పుదారి పట్టించానని అనంతు అభిప్రాయం పరంధామయ్యను పట్టి కుది పేస్తోంది. ఆనాటి నుండి మానసికంగానే కాదు, శారీరకంగా కూడా క్షీణించసాగాడు... అందుకే ఆదిత్య అడిగిన ప్రశ్నకు బదులు చెప్పకుండా మిన్నకుండి పోయాడు.

కాలచక్రం మరో మూడు నెలలు ముందుకు తిరిగింది. పరంధామయ్య మరింత మానసికంగా కుంగిపోయాడు. మానవ సంబంధాలు, మానవతా విలువలకు ప్రాధాన్య మిచ్చే మనుషులు ఆదిత్య అడిగిన ప్రశ్నకు బదులుగా నిలుస్తారని చెప్పాలనిపించింది. కాగితం కలం తీసుకొని వ్రాయసాగారు. "చిరంజీవి ఆదిత్యకు తాతయ్య ఆశీస్సులతో వ్రాయునది, నీవు విజయవాడ వెళ్ళేముందు నీతల్లినో ప్రశ్న అడిగావు. ఈ ఉత్తరం సాంతం చదివి నీ ప్రశ్నకు జవాబు దొరుకుతుందేమో వెతుక్కో నా చిన్నతనంలో గ్రామసీమలందలి జనాలు ఒకరికొకరై ఐకమత్యంగా ఉండేవారు. మనుషుల మధ్య బంధాలు అనుబంధాలు బలంగా ఉండేవి,మానవ సంబంధాలు పరస్పర సహకారాలతో ప్రతిభింబించేవి, ఆదరణ, అభి మానం,ఆప్యాయత పరోపకారచింతనకు ఆయా బంధాలు అద్దం పట్టేవి...ఒక ఇల్లాలికి ప్రసవ నొప్పులు ప్రారంభమయితే గ్రామంలోని పెద్దముత్తైదువులంతా దగ్గర ఉండి సుఖప్రసవ

## 'ఆ రెండూ కావలెను !'

**మా**వద్ద సరసమైన ధరలకే అన్నీనూ
ఖూనీలకు కత్తులు
నరుక్కునేందుకు గొడ్డళ్ళూ
మోసేందుకు ఆనలుగురు కూలివాళ్ళూ
కిరాయి గూండాలూ.... గజదొంగలూ
అసలు అన్నమాటకు తిలోదకాలిస్తే
నకిలీమందు మరియు మందులు
కొన్ని నోట్ల కట్టలు మీవి కావనుకుంటే
పార్టీ 'సభ'లకు.... ఊరేగింపులకు
సమ్మెలకు.... దాడులకు
ఎదురు దాడులకు.... అన్యాయాలకు
అక్రమాలకు.... అల్లర్లకు... వేడుకలకు
అందుబాటు ధరల్లో లభ్యం !
అన్నీ ఉన్నాయి మావద్ద కానీ
ఎన్నో ఉన్నాయి అయినా
లేనివి మాత్రం రెండంటే రెండే
ఎంత ధరైనా పెట్టి పట్టి
మా భాండాగారంలో భాగమిద్దామన్నా
దొరకటం లేదు అవే
కన్నీళ్లూ... కన్న తల్లి పాలూ.....!
బాబ్బాబ్బూ ఎక్కడున్నాయో
మీకు తెలిస్తే చెప్పండి
మీ రుణం ఉంచుకోం నిజంగా !

**-లక్ష్మీభారతిరెడ్డి**

మయ్యేదాకా సహకరించేవారు. ఏ ఇంట శుభకార్యం జరిగినా పిలవకున్నా వెళ్ళి తలా ఓ పని చక్కపెట్టేవారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తమదిగా భావించి ఆదుకొనేవారు. రోగాలతో బాధపడేవారిని పరామర్శించి ధన సహాయమో, మానవ సహాయమో అందించి వారికి ఓదార్పునిచ్చేవారు. ఏ ఇంట మరణం సంభవించినా ఊరంతా కదలివచ్చి శవానికి దగ్గరుండి అంత్యక్రియలు జరిపించి, ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి పది పన్నెండు దినాలపాటు వారికి ఆహార సదుపాయాలు కల్పించి మాములు స్థితికి తెచ్చేవారు. తమకున్న దానిలో కొంత లేనివారికి అవసరం కలిగిన వారికి అడగనిదే పాలు, మజ్జిగ, జున్ను, పథ్యం కూరలు, పచ్చళ్ళు పంచేవారు. పెద్దలను గౌరవిస్తూ దేవుని భజనలు చేస్తూ అందరూ అన్యోన్యంగా ఉండేవారు. గ్రామస్థుల మధ్య ఏవైనా పొరపొచ్చాలు తలెత్తినా గ్రామపెద్దల తీర్పే శిరోధార్యంగా ఉండేది. ఇదంతా గతం. ప్రస్తుత పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం ఇదంతా నీవు చూస్తున్నదే. నీప్రశ్నకు జవాబు వెతికే ముందు ఒక విషయం గుర్తుంచుకో సమాజంలోని ఈ మార్పుకు ఎన్నోకారణాలు ఉన్నాయి కాని ప్రధాన కారణం తల్లి తండ్రుల బాధ్యతారాహిత్యం. అమ్మ నాన్నలు ఇతరేతర ప్రభావాలకులోనై తమ బిడ్డలకు నైతిక విలువలు తెలియచేయడంలో విఫలమయ్యారు. నా బిడ్డ విషయంలో నేనూ అంతే. ఆ ప్రభావమే నేటి సమాజ పరిస్థితికి మూలమయింది. ఇదే ఒరవడిలో మీ తరం కూడా పోతే ముందు తరం పరిస్థితి ఊహించి చూడు, నీతాతయ్య పరంధామయ్య."

అందుకున్న ఉత్తరాన్ని ఆదిత్య పదేపదే చదివాడుఅయినా అతని సందేహం సరిగా తీరలేదు. తెలిసీ తెలియనట్టే ఉంది. ఏదిఏమైనా తాతయ్యను చూడాలనిపించింది మిత్రులకు చెప్పి మోటారు బైక్ పై ఇంటిదారి పట్టాడు. అది జాతీయ రహదారి. తాతయ్య ఆలోచనలతో బైక్ నెమ్మదిగానే నడుపుతున్నాడు. వెనుక నుండి వేగంగా వచ్చిన లారీ తన బైక్‌ను గుద్దింది. ఆదెబ్బకు బండినుండి రోడ్డుప్రక్కన గల బండ పై ఎగిరిపడ్డాడు. తలవెనుక బలమైన గాయం తగిలింది అంతలోన్నృహ కోల్పోయాడు. అచేతనంగా పడిఉన్న ఆదిత్యను చూస్తూ వందలాది వాహనాలు, వేలాది ప్రయాణికులు వెళుతూనే ఉన్నారు అందులో ఏ ఒక్కరికి జాలి పుట్టలేదు. అతని గురించి పట్టలేదు. దాదాపు ఆ రాత్రంత ఆ రోడ్డు ప్రక్కనే అచేతనంగా పడి ఉన్నాడు. తెలతెలవారే ముందు ఆదిత్య ముందు ఒక మారుతి కారాగింది, దాని నుండి ఒక ఆజానుబాహుడు దిగాడు దాదాపు నలభై దాకా వయసుంటుంది అలా అనాధ శవంలా పడిఉన్నది ఎవరాఅన్నది అతను ఆలోచించ లేదు. అతను బ్రతికి ఉన్నాడా లేదా అని పరిశీలించాడు. ఊపిరి ఉందని గమ నించాడు. డ్రైవర్ సాయంతో కారులో చేర్చాడు. తన సెల్ ద్వారా పోలీసులకు తెలిపాడు. ఆసుపత్రిలో చేర్చాడు. తనకు తెలిసిన స్పెషలిస్టును రప్పించాడు. యాభై వేల రూపా యలతో అద్వాన్సు కట్టాడు. రక్తం అవసర మంటే తన రక్తాన్ని ఇచ్చాడు తన పనులు మానుకొని ఆదిత్య కన్నులుతెరిచే వరకూ తను కన్నులు మూయలేదు. ముప్పది ఆరు గంటల తరువాత కన్నులు తెరచిన ఆదిత్యను అడిగి అతని ఇంటి నంబరుకు ఫోన్ చేసాడు.. తల్లి తండ్రులు పరుగున వచ్చారు వెంట తాతగారు వచ్చారు బిడ్డను చూచి బెంబేలు పడిన తల్లి తండ్రు లిద్దరూ డాక్టరు గదికి పరుగెత్తారు.. తాతగారు మనుమడి వద్దనే కుర్చీపై కూర్చొ న్నారు. డాక్టర్లుగారు ఆదిత్యకు ప్రాణాపాయం తప్పిందని చెప్పారు. అందుకు అనంత రామయ్య కృతజ్ఞతలు చెప్పాడు, నాకు కాదండీ ధ్యాంక్స్ చెప్పాల్సింది వారికి అని డాక్టరు ఆ అపరి చితుని ఆదర్శభావం గురించి జరిగిన దంతా వివరంగా చెప్పాడు.

ఆ యువకుడు దేవునిలా కని పించాడా దంపతులకి. చిన్నవాడయినా చేయెత్తి మొక్కారు అంతటి పరిస్థితిలోను అనంతరామయ్య ఆత్మావలోకనం చేసుకుంటు న్నాడు నాన్న పరంధామయ్య మదిలో మెదిలాడు. మానవ సేవే మాధవ సేవే అని చెప్పిన నాన్న ఆ బాటలోనే నడిచాడు. తన బిడ్డను నడి పించాడు. అందరిలాగాకాదు తనలాగే ఆలోచించి "మనకెందుకులే" అని ఈ మహాను భావుడు కూడా అనుకొని ఉంటే అప్పుడు నాబిడ్డ పరిస్థితి ఇప్పుడు నా పరిస్థితి ఎలా ఉండేది ఈ భావం అనంతరామయ్య మదిలో మెదలగానే పరుగున ఆదిత్య ఉన్న బెడ్‌రూంకు వెళ్ళాడు వెంటనే అపర్ణ.... ఆ వెనుక అపరి చితుడు వెళ్ళారు, "నాన్నా నాకు కనువిప్పు అయ్యింది నాదాకా వస్తేగాని నాకు తెలిసింది కాదు నీ మనసు నొప్పించాను నన్ను క్షమించు అని తండ్రి పాదాలపై పడి తన కన్నీటితో తండ్రి పాదాలు కడిగాడు. "మాస్టారూ మీరా నేనండీ మీ శిష్యుడను వెంకటను"ఆనందంగా చెప్పాడు. అపరిచితుడు పరంధామయ్యలో చలనం లేదు అప్పటికే అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఈ నేపథ్యంలో ఆదిత్య కలవరిస్తున్నాడు నిద్రలో తాతయ్యా నాప్రశ్నకు బదులు చెప్పరా? అని "నేను చెబుతాను బాబు! నీ ప్రశ్నకు బదులు నే చెబుతాను" అంటూ దు:ఖసాగరంలో మునిగిపోయాడు అనంతరామయ్య.


## కొత్త ఇల్లు కోరుకునే వారికి గొప్ప అవకాశం

అందమైన ఇండ్లను నిర్మించాలన్నా
పాతవాటికి మెరుగులు దిద్ది కొత్తదిలా
మెరవాలన్నా కాంట్రాక్ట్ పద్ధతిపై
క్వాలిటీ తగ్గకుండా అనుకున్న టైంకి
పూర్తిచేసి పూర్తిస్థాయి
పటిష్టమైనటువంటి, ఆధునిక
సౌకర్యాలతో కూడిన భవంతుల
నిర్మాణానికి సంప్రదించండి

**సైకం ఉదయ భాస్కర్**
**సెల్: 94415 18403**